

# సంసారంలో సరిగమలు

## - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## నేమ్ లో నే ముంది?

**మోహిత్‌కి పాలు అంటే చిరాకని, కాఫీ అయితే** ఎన్నిసార్లయినా తాగుతాడని వాళ్ళమ్మ ముందే చెప్పడంతో మొదటి రాత్రి గదిలోకి కాఫీ కప్పుతో ప్రవేశించింది మిసిమి. సర్వం కోల్పోయిన వాడిలా మోహిత్ మంచం చివర కుర్చుని ఆలోచనలో నిమగ్నమై ఉన్నాడు. శోభనం రోజని ఎగిరి గంతులేయక్కర్లేదు కానీ మరీ ఇంత నిర్లిప్తంగా కూడా ఉండకూడదేమో అనుకుంది మిసిమి.

"రా మిసిమీ కూర్చో. ఏంటి కాఫీ తెచ్చావా? థాంక్స్." ఆమె చేతిలోని కాఫీ కప్పుని అందుకుని ఆనందంగా ఓ గుక్క తాగి మళ్ళీ విచారంగా చెప్పాడు.

"ప్రేమ ఎంతో మధురమైంది మిసిమీ."

"కాదని నేననలేదే?"

"నిజమే. నువ్వనలేదు. కానీ విరూపాక్ష రావు అన్నాడు."

"ఆయనెవరు మధ్యలో?"

"నా పాలిటి విలన్. వినీల వాళ్ళ నాన్న"

"వినీల ఎవరు?"

"నా ఆరాధ్యదేవత. వాళ్ళనాన్నే రాక్షసుడు. మా పెళ్ళికి ససేమిరా ఒప్పుకోలేదు. పై చదువులని వంక పెట్టి నీలూని అమెరికా పంపేసాడు."

మిసిమి రెండు చేతులూ పట్టుకుని ప్రాధేయపూర్వకంగా చెప్పాడు.

"ఈ దుఃఖంలోంచి నువ్వే నన్ను బయటకి తీసుకురావాలి మిసీ. నీవా జ్ఞాపకాలలోంచి నేను బయటపడడానికి నువ్వే సహాయం చేయాలి"

"తప్పకుండా అయితే ముందు నాదో షరతు" మంచం మీద కూర్చుంటూ చెప్పింది.

"ఏమిటది? కొంపతీసి నీలూని మర్చిపొమ్మనవు కదా? అది నా వల్లకాదు."

"అబ్బే! నిక్షేపంగా గుర్తుంచుకోండి. కాకపోతే నన్ను మిసీ, మిస్ మీ ఇలా మాత్రం పిలవకండి. నాకు ఇష్టం ఉండదు. పూర్తిగా మిసిమి అని పిలవండి. సరేనా?"

"సరే. కాఫీ చాలా బావుంది. మీ ఇంట్లో ఫ్లాస్క్ లేదా?"

"ఉంది ఎందుకు?"

"ఉంటే ఫ్లాస్క్ నిండుగా కాఫీ తేవాల్సింది. ఇలా కప్పుతోనా?" అసంతృప్తిగా చెప్పాడు.

"నిజమే నాకు తట్టలేదు. రేపు రాత్రికి అలాగే చేస్తాను."

"నువ్వే కలిపావా?"

"లేదు. మా అమ్మ."

"నా కోసం నువ్వు మీ అమ్మ దగ్గర కాఫీ కలపడం నేర్చుకుంటావా మిసిమీ?" దీనంగా అడిగాడు.

అతనిలోని అమాయకత్వానికి విరగబడి నవ్వింది మిసిమి.

"అబ్బ! నవ్వుతుంటే ఎంత అందంగా ఉన్నావో, వినీల అంతకాకపోయినా నువ్వూ అందగత్తెవిలే" మెచ్చుకున్నాడు మోహిత్.

●●●

"మోహిత్ మంచివాడే అమ్మా!. కాకపోతే కొంచెం అమాయకత్వం ఉంది. అందుకే అప్పుడప్పుడూ విసుగొస్తుంటుంది" కాపురానికి వెళ్ళిన తర్వాత మొదటిసారి పుట్టింటికి వచ్చిన మిసిమి తల్లితో చెప్పింది.

"చెడ్డతనం కన్నా అమాయకత్వం నయమేగా? నువ్వే నెమ్మదిగా అతన్ని ఆ అమాయకత్వం నుంచి బయటపడెయ్." తల్లి సలహా ఇచ్చింది.

"వద్దులేమ్మా ఆ జీవిని అలా ఉండనియ్" మురిపెంగా చెప్పింది మిసిమి.

●●●

ఇప్పుడు మోహిత్ మిసిమిని అపరిమితంగా ప్రేమిస్తున్నాడు. అంతకంటే ఎక్కువగా ఆమె చేసినకాఫీని ప్రేమిస్తున్నాడు. కానీ వినీలని మాత్రం మర్చిపోలేదు. అతను మాట్లాడే ప్రతీవాక్యంలో ఆమె పేరు వచ్చి తీరుతుంది. తనో గొప్ప అమర ప్రేమికుడు అనే బలీయమైన భావనలో మోహిత్ పూర్తిగా మునిగిపోయాడు. మిసిమి ఆ విషయాన్ని పట్టించుకోదు.

●●●

ఆ రోజు ఆఫీస్ నుంచి వచ్చిన మోహిత్ మిసిమితో చెప్పాడు.

"మిసిమీ ఆకలి.! కడుపు కాలిపోయింది. ఏమైనా పెట్టకపోతే ఫెయింటై పోతాను"

"గారెలు చేసాను. ఒక్క నిమిషంలో తీసుకొస్తా" వంటింట్లోంచి అరిచింది మిసిమి.

"గారెలా! వినీలకి గారలంటే ఎంతిష్టమో" ఆనందంగా చెప్పాడు.

ఆ ఆనందం గారెలు వండినందుకో, వినీలకి ఇష్టమైనందుకో అర్థం కాలేదు మిసిమికి.

అరడజను గారెలు తిన్నాక ఆత్మారాముడు శాంతించి తలెత్తి మిసిమి వంక కృతజ్ఞతగా చూసాడు మోహిత్. మరుక్షణం కెవ్వున కేకపెట్టాడు.

"ఏమైంది?" అదిరిపడి అడిగింది మిసిమి.

"నీలం రంగు చీరకట్టుకున్నావా మిసిమీ. వినీలకి నీలం రంగంటే ఎంతిష్టమో తెలుసా?" ఆనంద భాష్పాలు తుడుచుకుంటూ చెప్పాడు మోహిత్.

"మరి వినీల అని పేరెందుకు పెట్టుకుంది? వినీల అంటే 'నీలం కానిది' అని అర్థంకదూ?" అడిగింది మిసిమి.

"నీకసలు బుద్ధిలేదు మిసిమీ. ఎవరైనా వాళ్ళ పేర్లు వాళ్ళు పెట్టుకుంటారా? వాళ్ళ పేరెంట్స్ పెడతారు కానీ?" విసుక్కున్నాడు మోహిత్.

ఆ రోజే కాదు వారి మధ్య ప్రతీ రోజూ ఇలాంటి సంభాషణలే జరుగుతూంటాయి.

●●●

భార్యని పురిటికి పుట్టింటికి పంపాక తిరణాలలో తప్పిపోయిన పిల్లాడిలా బిక్కమొహం వేసుకుని తిరిగిన మోహిత, కొడుకు పుట్టాడన్న వార్త వినగానే రెక్కలు కట్టుకుని వాలిపోయాడు. బాలింత అందాలతో కొత్తగా మెరిసిపోయున్న మిసిమిని మెచ్చుకోలుగా చూసి చెప్పాడు.

"చాలా బావున్నావ్ మిసిమి."

మరి డెలివరీ అయిన వినీల ఎలా ఉంటుందో అతనికి తెలీదు పాపం పోల్చడానికి.

"బాబుకి పేరేం పెడదాం?" అతన్ని ఇష్టంగా చూస్తూ అడిగింది మిసిమి

"నీల్"

"నీల్? అదేంటి ఇంగ్లీషు పేరు? నేను హిమాంశు అనుకున్నాను." అలకగా చెప్పింది.

"హిమాంశు అంటే?"

"అంటే మంచు బిందువు. నీహారిక, హిమబిందులాగా అన్నమాట."

"మరి అమ్మాయి పేరేమో మిసిమి"

"కాదు బంగారం. అబ్బాయి పేరే. హిమాంశు అని పెడదాం."

"లేదు. నీల్ అని చెప్పాగా."

"ఓహో! అర్థమైంది. మరి నీల్ ఎందుకు? పూర్తిపేరు వినీల్ అనే పెట్టండి."

నింపాదిగా చెప్పింది.

"మరి నువ్వేం అనుకోవుగా హిమాంశు పెట్టలేదని?"

"అస్సలు అనుకోను"

"అయితే సరే."

ఆనందంగా నవ్వి 'వినీల్' అని బియ్యంలో రాసాడు మోహిత్.

●●●

మోహిత్‌కి కష్టం అని నెలలోగానే వినీల్‌తో ఇంటికి వచ్చేసింది మిసిమి. ఇంట్లో ఉన్నంతసేపూ మోహిత్, 'నీలూ నీలూ' అని వాడి మంచం చుట్టూ తిరుగుతూనే ఉంటాడు. అది విన్నప్పుడల్లా నవ్వుకుంటుంది మిసిమి. 'ఈ పాటికి ఆ వినీల ఎవర్నో పెళ్ళి చేసుకుని

హాయిగా ఉండి ఉంటుంది. మోహిత్ పేరు కూడా ఆమెకి గుర్తుండకపోవచ్చు. ఈ పిచ్చివాడు మాత్రం మర్చిపోనందుకు ఆనంద పడుతూంటాడు' అనుకుంది.

వినీల మాత్రం వాడిని 'విన్నూ' అని పిస్తుంది.

●●●

ఆ రోజు మోహిత్ ఆఫీస్ నుంచి వచ్చే టైంకి ఇంట్లో ఓ కొత్త వ్యక్తి ఉన్నాడు.

"ఏమండీ ఇతను నా క్లాస్ మేట్ అశ్విన్. ఢిల్లీలో ఉంటున్నాడు. ఏదో పనిమీద హైదరాబాద్ వచ్చాట్ట. నన్ను చూద్దామని వచ్చాడు" పరిచయం చేసింది మిసిమి.

తనకన్నా తెల్లగా, ఎత్తుగా, అందంగా ఉన్న అశ్విన్‌తో కొద్దిగా అసూయగా కరచాలనం చేసాడు మోహిత్.

"ఆయన ఆకలికి అస్సలు ఆగలేరు అశ్విన్. నేను ఇప్పుడే వస్తాను. మీరు మాట్లాడుతూండండి." కిచెన్ లోకి వెళ్ళింది మిసిమి.

"మీరు ఢిల్లీలో ఏం పనిచేస్తూంటారు?" అయిష్టంగానే అడిగాడు మోహిత్.

అశ్విన్ చెప్పిన వివరాలు విన్నాక అతనిలోని అసూయ ఇంకాస్త పెరిగింది. తనకన్నా పెద్ద ఉద్యోగం.

"ఇందాకటి నుంచి మీ గురించే మాట్లాడుకుంటున్నామండీ. మీరు ఎవరో వినీల అనే అమ్మాయిని ప్రేమిస్తే వాళ్ళ పేరెంట్స్ ఒప్పుకోలేదుట కదా?" అడిగాడు అశ్విన్.

రవ్వంత విచారం, కొద్దిగా గర్వంతో తలుపాడు మోహిత్.

"ఈ పెద్దవాళ్ళెప్పుడూ ఇంతేనండీ. మమ్మల్ని కూడా ఇలానే విడదీసారు" ఆవేశంగా చెప్పాడు అశ్విన్.

"అంటే?" మోహిత్ సందేహంగా చూస్తూ అడిగాడు.

"నేను మిసిమి చిన్నప్పటినుంచి క్లాస్ మేట్స్‌మండీ. ఫ్రెండ్షిప్ పెరిగి ప్రేమయింది కానీ ఆ పుండరీకాక్షయ్య ఒప్పుకోలేదు."

"ఆయనెవరు?" అయోమయంగా అడిగాడు మోహిత్.

"అదేంటి మీ మామగారి పేరే మీకు గుర్తులేదా?"

"ఓ మిసిమి వాళ్ళ నాన్నా? ఏమన్నాడు?"

"మా కులం వేరని ఆయన ఇష్టపడలేదు. 'మా అమ్మాయిని కులమింటి కోతికైనా ఇచ్చి పెళ్ళి చేస్తాను కానీ నీకివ్వను' అని నాతో చెప్పి, మీతో పెళ్ళి జరిపించాడు."

"హుం" నిట్టూర్చాడు మోహిత్.

"పెళ్ళి వారం రోజులుండనగా కూడా మిసిమి నా దగ్గరకి వచ్చి ఏడ్చింది పాపం 'విన్నూ ఎక్కడికైనా వెళ్ళిపోదాం' అని నేనే వద్దని ఓదార్చాను."

"ఏంటీ విన్నునా?" కీచుగా అరిచాడు మోహిత్.

"అవును. నా పేరు అశ్విన్ కదా. ముద్దుగా విన్నూ అని పిలిచేది మిసిమి. నేను మాత్రం మిసిమి అనే పిలిచేవాడిని. బంగారం లాంటి తన పేరుని విరవడం, ముక్కలు చేయడం నాకు ఇష్టం లేదు" ఓ నిమిషం ఆపి నిట్టూర్చి మళ్ళీ చెప్పాడు అశ్విన్.

"నిజానికి ఈ విషయాలేవీ మీతో చెప్పకూడదు. కానీ మీది భగ్నహృదయమేనని, మీరు ప్రేమించిన వినీలని ఈ రోజుకీ మర్చిపోలేదని మిసిమి చెప్పింది. దాంతో నేను నా ప్రేమ గురించి మీతో చెప్పాను."

"హుం" మరోసారి నిట్టూర్చాడు మోహిత్.

రెండు ప్లేట్లలో పకోడీలు తెచ్చి వారికిచ్చి చెప్పింది మిసిమి.

"తింటూండండి. కాఫీ తెస్తాను."

పకోడీల ప్లేట్‌ని చూసి ఆనందంగా చెప్పాడు అశ్విన్.

"నాకు పకోడీలు అంటే ఇష్టం అని నీకు ఇంకా గుర్తున్నందుకు హేపీగా ఉంది మిసిమీ. ఇన్నాళ్ళు నీ అద్భుతమైన కాఫీని మిస్సయ్యాను."

కొద్దిసేపు కబుర్లు చెప్పి కాఫీ తాగి అశ్విన్ వెళ్ళిపోయాడు.

●●●

ఎప్పుడూ మిసిమి వెనక తిరుగుతూ ఏవో కబుర్లు చెప్తూంటే మోహిత్ సోఫాలో కదలకుండా కూర్చుని ఏదో ఆలోచిస్తూండిపోయాడు.

"ఏమైంది? వినీల గుర్తొచ్చిందా?" పక్కన కూర్చుంటూ అడిగింది మిసిమి.

"నువ్వు అశ్విన్ గురించి నా కెందుకు చెప్పలేదు?" ఉక్రోషంగా అరిచాడు మోహిత్.

అతని మొహంలోకి ఓసారి చూసి అతని ఎదురుగా కూర్చుని అడిగింది మిసిమి.

"మీ ప్రేమ గోల తప్పించి, 'నువ్వెవరినైనా ప్రేమిచావా' అని ఈ మూడేళ్ళలో ఒక్కసారైనా అడిగారా?"

"లేదు. కానీ నేనంత ఫ్రాంక్ గా చెప్పినప్పుడు నువ్వు చెప్పాలి కదా?"

"ఓకే చెప్పాననుకోండి. నేను వినీల వ్యవహారాన్ని తీసుకున్నంత స్పోర్టివ్‌గా మీరు అశ్విన్ విషయాన్ని తీసుకునేవారా?"

మోహిత్ ఏమీ మాట్లాడలేదు.

"ఒకవేళ నేను చెప్పి ఉంటే ఏం జరిగేదో తెలుసా? నా ఆనందానికి, దుఃఖానికి, నేను ఎర్రచీర కట్టుకోడానికి, వర్షంలో తడవడానికి అన్నిటికీ మూలకారణం అశ్విన్ అనుకునేవారు. అవునా, కాదా?"

"కానీ.." మధ్యలోనే ఆగిపోయాడు మోహిత్.

"మీరు గారెలంటే వినీలకి ఇష్టం' అన్నంత స్వేచ్ఛగా, నేను 'పకోడీలంటే అశ్విన్‌కి ఇష్టం' అంటే మీరు నాలాగా నవ్వేసేవారా?"

మోహిత్ కోపంగా చూసాడు కానీ బదులీయలేదు.

మిసిమి దిగులుగా నవ్వి చెప్పింది.

"చూడండి. భర్త అనేవాడు మంచివాడు, అమాయకుడు, భోళామనిషి లాంటి విశేషణాలు ఎన్ని కలిగి ఉన్నా 'భార్యకి ప్రియుడున్నాడు' అన్న విషయం తెలిస్తే మాములు భర్తలాగే రియాక్ట్ అవుతాడు తప్పించి వేరేగా కాదు. అందుకే చెప్పలేదు. మీరు వినీలని అన్నిసార్లు తల్చుకుంటుంటారు కదా, అప్పుడు నేను బాధపడతానేమో అని ఒక్కసారి కూడా ఆలోచించలేదు. ఇప్పుడు ఒక్కసారి అశ్విన్ ని కలవగానే ఎందుకంత బాధపడుతున్నారు? అతను వెళ్ళాక నేను అతని గురించి ఏమీ మాట్లాడలేదే?"

దాదాపు అరగంట సేపు అలాగే ఉండిపోయాడు మోహిత్. ఆ తర్వాత లేచి ఆమె ఒడిలో తలపెట్టుకుని చెప్పాడు.

"నాకో ప్రేమకథ ఉంది అంటే ఏదో గొప్పగా ఫీలయ్యాను కానీ మిసిమీ, నేను ఇప్పుడు వినీలని చూస్తే గుర్తుపట్టలేనేమో కూడా. ఆ అమ్మాయి రూపం చాలా అస్పష్టమై పోయింది తెలుసా? గొప్పకోసం అన్నిసార్లు తలుచుకుంటాకానీ నిజానికి నాకు నువ్వంటే భలే ఇష్టం. అశ్విన్ అందగాడు. నాకంటే పెద్ద ఉద్యోగం. కానీ ఈ మూడేళ్ళలో నేను నీలో ఆ అసంతృప్తి చూడలేదు. ఇప్పుడు అతన్ని చూసి నాకు ఈర్ష్యగా అనిపించింది. "

"నిజంగానే అతని ప్రస్థావన నాకు ఇష్టం ఉండదు. నువ్వేమైనా అనుకో."

పిల్లవాడి ఏడుపు వినిపించింది.

"అయ్యో! విన్నూ లేచాడు. కొద్దిగా వాడిని ఆడిస్తూండండి. వంట చేస్తా" కిచెన్‌లోకి పరిగెత్తింది మిసిమి.

పిల్లవాడ్ని ఆడిస్తూ, వంటగదిలోకి చూస్తూ అరిచాడు మోహిత్.

"మిసిమీ. మీ నాన్నపేరు పుండరీకాక్షయ్య. మరి మీ అమ్మ పేరేంటి?"

"తోయజాక్షి అయినా ఎందుకు?"

"పద్మాక్షి అంటే సరిపోయేదిగా! మళ్ళీ తోయజాక్షి' అంత సంస్కృతం అవసరమా? సరే మా అమ్మ అచ్యుతవల్లి, నాన్న ఘటికాచలం. 'అతోపుంఘు.', ఛీఛీ అఘుతోపుం ఇంకా ఛీఛీ. ప్రపంచంలో పేర్లేమీ లేనట్లు ఏం పేర్లు పెట్టుకున్నారో!

మిసిమీ ఓసారిలా వస్తావా?"

"ఎనిమిదయ్యేసరికి 'అన్నమో రామచంద్రా' అని ఆగలేరు. నన్ను ప్రశాంతంగా వంట చేసుకోనీకుండా ఏంటీ గొడవ?" వంట గదిలోంచి అరిచింది మిసిమి.

"పోనీ ఈరోజు బయట తిందాంలే. నువ్వు తొందరగా రా. అతి ముఖ్యమైన నిర్ణయం తీసుకోబోతున్నాను." బదులుగా అరిచాడు మోహిత్.

బయట తినడం అన్నమాట వినగానే టకటక స్టవ్‌లు ఆపేసి విప్పారిత మొహంతో బయటకి వచ్చింది మిసిమి.

"అమ్మయ్య ఈ పూట వంట గొడవ లేదు. ఇంక చెప్పండి."

"ఏం లేదు మిసిమీ. అర్జెంట్‌గా వీడిపేరు మార్చేయాలనుకుంటున్నాను. పాపం మన అమమ్మ్వాళ్ళు సంతోష పడతారు కదా వాళ్ళ పేర్లు కలిసొచ్చేలాగా పెడదాం అనుకుంటే అవేం పేర్లు? పాపం వాళ్ళమ్మా నాన్నలు మంచిపేర్లు పెట్టలా"

"వినీల్ బానే ఉందిగా మళ్ళీ మార్చటం ఎందుకు? ఏరా విన్ను నాన్న నీ పేరు మార్చేస్తారుట. వద్దని చెప్పు." పిల్లవాడిని ముద్దాడసాగింది.

"ఆపు" గర్జించాడు మోహిత్.

"వీడు విన్నూ కాదు. నీలూ కాదు అసలు వినీల్ కాదు."

అతనివంక కొంటెగా చూసి బుద్ధిగా తలాడించింది.

"అవునూ వీడు పుట్టినప్పుడు నువ్వేదో పేరన్నావు ఏంటదీ? వర్షపు చినుకా?"

"వర్షపు చినుకూ కాదు, చెమట చుక్కాకాదు. హిమాంశు. అంటే మంచుబిందువు"

"ఓకే ఇక నుంచి వీడిపేరు హిమాంశు. హిమ్ము.. ఛీ.. ఉమ్మలాగా ఉంది పోనీ అంశూ. మరీ కన్నీళ్ళయిపోయిందే? మిసిమీ వీడికో ముద్దుపేరు చెప్పవా?"

"ముద్దుపేరా?" ఓ నిమిషం ఆలోచించి చెప్పింది మిసిమి.

"మిమో"

"మిమో అంటే?"

"మొద్దబ్బాయ్ మిమో అంటే మిసిమి, మోహిత్" అతని ముక్కు పట్టుకుని ఆడిస్తూ చెప్పింది.

"అవును మిసిమీ. మనకి ఎవరూ వద్దు. నీకు నేను, నాకు నువ్వు, మనకి వీడు. వీడిపేరు హిమాంశు. ముద్దుపేరు మిమో. అంతే"

వాళ్ళిద్దర్నీ రెండు చేతుల్తో ఆలింగనం చేసుకుంటూ చెప్పాడు మోహిత్.

*(మరో సరిగమ వచ్చేనెలలో)*

Click here to share your comments on this story